

తాగునీటి లో ప్రెషర్ సమస్య గురించి స్థానికులను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

తాగునీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య పరిష్కరించాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ఏ కాలనీ, ఏ బస్తీలో కూడా మంచినీటి సరఫరాలో లోప్రెషర్ సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. ఆంధ్రాకేఫ్ చౌరస్తా సమీపంలోని బీఎస్.రెడ్డి వీధిలోని స్థానికుల ఫిర్యాదు మేరకు కార్పొరేటర్ మంగళవారం స్థానిక జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, ఇన్‌స్పెక్టర్ శంకర్‌లతో కలిసి పర్యటించి సమస్యను పరిశీలించారు. బీఎస్.రెడ్డి వీధిలో స్థానికులు మంచినీటి లోప్రెషర్ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. దీంతో ప్రత్యేక దృష్టి సారించి నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేయాలని డీజీఎంకు సూచించారు. డివిజన్‌లో తీవ్రంగా మారిన మంచినీటి లోప్రెషర్ సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్ కుమార్, ఆనంద్‌రావు, అరుణ్‌కుమార్, జ్ఞానేశ్వర్, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. శంకర్ మఠ్, ఫీవర్ ఆస్పత్రి 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధుల్లోని నల్లకుంట, పద్మకాలనీ, మాతృశ్రీస్కూల్, అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్‌బంక్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు, నారాయణగూడ పరిధిలోని బాగ్‌లింగంపల్లి, ఈడబ్ల్యూఎస్‌క్వార్టర్స్, సూర్యనగర్, నెహ్రూనగర్, అరోరా డిగ్రీ కాలేజ్ తదితర ప్రాంతాల్లో 12 నుంచి 1 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పద్యనాటకాలు తెలుగువారి సొంతం : డా. రాము

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పద్యనాటకాలు ప్రపంచంలో ఒక్క తెలుగువారి సొంతం అని జవహర్‌బాలభవన్ మాజీ డైరెక్టర్ డా.ఎంకే. రాము అన్నారు. తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ సౌజన్యంతో మంగళవారం త్యాగరాయ గానసభలో ప్రముఖ నటుడు వల్లూరు శ్రీహరిరావు ఆధ్వర్యంలో రామాంజనేయ యుద్ధం పౌరాణిక పద్యనాటక ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డా.రాము కళాకారులను సత్కరించి మాట్లాడుతూ పద్యనాటకాలను కాపాడుకుని భవిష్యత్‌తరాలకు అందించాలన్నారు. లోకం కృష్ణయ్య, మణిపాలరెడ్డి, వెంకటేశ్వరరావు, కామేశ్వరరావు, రామరాజు, రమాదేవి, పరమేశ్వర్, భోగరాజు ఆదిత్య, శ్రీకృష్ణ, నామచంద్రబాబునాయుడు, బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సంగీత రంగ ప్రముఖులకు సత్కారం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంగీత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో శాస్త్రీయ సంగీత రంగ ప్రముఖులను సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా.కేవీ.రమణాచారి జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాట్యగురువు, తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమి చైర్మన్ డా.అలేఖ్య పుంజలతోపాటు రమణాచారి ఇటీవలే కేంద్రప్రభుత్వం పద్మశ్రీ అవార్డును ప్రకటించిన ద్వి శతసహస్రావధాని డా.నాగఫణిశర్మతోపాటు రాఘవాచారి, హరిప్రియ, డీవీ మోహనకృష్ణ, ద్వారం సత్యనారాయణ, డి.శ్రీరామమూర్తి, జానకీరాములుకు సప్తస్వర సంగీత సామ్రాట్ బిరుదుతో సత్కరించారు. అలేఖ్య పుంజల మాట్లాడుతూ సంగీత నాటక అకాడమి రాబోయే రోజుల్లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తోందని, ఇందుకు రమణాచారి సలహాలు కావాలన్నారు. సంగీత కళాకారులు, జాతీయ సంగీత కళాకారుల సంఘం జాతీయ అధ్యక్షుడు చెన్నారావు స్వాగతం పలికి డా.రమణాచారిని సత్కరించారు. వినోద్‌బాబు బృందం సినీగీతాలు రాఘవేంద్ర బృందం నాదస్వర విన్యాసం ఆకట్టుకున్నాయి.

రేపు తెలంగాణ అమరుడు యాదయ్య వర్ధంతి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరుడైన సిరిపురం యాదయ్య వర్ధంతి సభ ఈ నెల 20న ఓయూ ఎన్‌సీసీ గేట్ వద్ద నిర్వహిస్తున్నామని సిరిపురం యాదయ్య స్మారక సమితి చైర్మన్ ప్రొ.తాటికొండ వెంకటరాజయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మేధావులు, కవులు, కళాకారులు, పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలంగాణ ఉద్యమ పోరాట నాయకులు, కళాకారులు, విద్యార్థి సంఘాలు, మహిళా సంఘాలు, పద్మశాలీ సమాజం కదిలి రావాలన్నారు.

ఒకరికి ఒకతీరు! మరొకరికి మరోతీరా!!

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి18 (ఆంధ్రజ్యోతి): ముస్లిం పండుగల సమయంలో ఒక తీరు...హిందూ పండుగలప్పుడు మరో తీరుగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీని ప్రభావం వచ్చే ఎన్నికల్లో కనిపిస్తుందని బీజేపీ, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ముస్లింలు అధికారులు, ఉద్యోగులు సాయంత్రం నాలుగు గంటలకే ఆఫీసుల నుంచి వెళ్లిపోవచ్చుననే వేసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీచేయడం సరికాదన్నారు. నవరాత్రి సమయంలో తొమ్మిది రోజుల పాటు హిందువులు ఉపవాసం ఉంటారని, అప్పుడు 'మీకు కనిపించలేదా' అని ప్రశ్నించారు. నవరాత్రులు, శ్రీరామనవమి సమయాల్లో మైక్ శబ్దాలు పెద్దగా ఉంటే కేసులు బుక్ చేస్తామని పోలీసులు హెచ్చరించారని ఆయన పేర్కొన్నారు. ఒక వర్గం ఓట్లతో సీఎం కాలేదనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు.

'ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్‌ను అమలు చేయాలి'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో క్రీమీలేయర్‌ను అమలు చేయాలని మాదిగ సంఘాల మహాకూటమి చైర్మన్ పోకల కిరణ్‌మాదిగ డిమాండ్ చేశారు. బర్కత్‌పురలోని మహాకూటమి కార్యాలయంలో మంగళవారం క్రీమీలేయర్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోకల కిరణ్‌మాదిగ దండోరా ధర్మదీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంఘాల నేతలు ఈ దీక్షలో పాల్గొని సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జనాభా గణాంకాల ప్రకారం ఎస్సీల రిజర్వేషన్ల కోటాను పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రజాగాయకుడు మాష్టార్జీ, భారతీయ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ గొల్లపల్లి దయానంద్‌రావు, మాదిగ మేధావుల సంఘం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్, ఇండియన్ ప్రజాకాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కేబీ.శ్రీధర్, జైభీమ్ సంఘం అధ్యక్షురాలు అంజని, కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జగదీష్, బీసీ యువజన సంఘం జేఏసీ నేత రమేష్, సమగర మోచి అధ్యక్షుడు డాక్టర్ కల్యాణి ప్రేమ్‌రాజ్ పాల్గొన్నారు.

నేడు స్వాతి మాస తిరునక్షత్ర వేడుకలు

అంబర్‌పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : అంబర్‌పేట డీడీ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహా అహోబిల మఠంలో బుధవారం స్వాతి మాస తిరునక్షత్ర వేడుకలు నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ శ్రీనివాసన్ తెలిపారు. ఉదయం 8.30 గంటల వరకు అభిగమన ఆరాధన, 9 నుంచి 10.30 గంటల వరకు స్వామి మాస విశేష తిరుమంజనం, అనంతరం అర్చన మహానివేదనం, సత్తుముర్రై గోష్ఠి తీర్థ ప్రసాద వితరం ఉంటుందని తెలిపారు. సాయంత్రం 6 గంటల నుంచి సహస్రనామ పారాయణం పానకారాధన సువర్ణ తులసీ అర్చన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఓ మహిళ మృతి చెందింది. కాచిగూడ ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... గోల్నాక సంజీవయ్యనగర్‌లో నివాసం ఉంటున్న వెంకటేష్ భార్య మంజుల(45) కూలిపనిచేస్తూ జీవనం సాగిస్తుంది. సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో చనిపోయింది. భర్త వెంకటేష్ పనికి పోయి తిరిగి రాలేదు. ఇంటి ఓనర్ ప్రశాంత్‌కుమార్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు



అంబర్‌పేట ఎస్‌ఆర్‌జీ ఫంక్షన్‌హాల్‌లో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, పద్మావెంకటరెడ్డి

రాంనగర్/అంబర్‌పేట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం 26 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ, తహసీల్దార్ సంధ్యారాణి, డీటీ ఎమ్మార్వో రఘువిష్ణు, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు టి.శంకర్ ముదిరాజ్, నాయకులు సాయికృష్ణ, ముచ్చకుర్తి ప్రభాకర్, రాజశేఖర్‌గౌడ్, ప్రేమ్, కల్యాణ్‌నాయక్, దేవేందర్ నాయక్, సుధాకర్, నితిన్ పాల్గొన్నారు.

అంబర్‌పేట నియోజకవర్గంలో..

అంబర్‌పేట నియోకవర్గంలోని 195మంది లబ్ధిదారులకు రూ.1,0016 చొప్పున రూ.1.95 కోట్ల విలువైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పంపిణీ చేశారు. మంగళవారం అంబర్‌పేటలోని ఎస్‌ఆర్‌జీ ఫంక్షన్ హాల్‌లో కార్పొరేటర్లు విజయ్‌కుమార్‌గౌడ్, బి.పద్మావెంకటరెడ్డి, అంబర్‌పేట తహసీల్దార్ వీరబాయితో కలిసి ఎమ్మెల్యే లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కులగణనను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- బీజేపీ కుటిల రాజకీయం చేస్తుంది : మాజీ ఎంపీ వీహెచ్



గోల్నాక నెహ్రూనగర్‌లో ఇంటింటికి వెళ్లి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు

గోల్నాక/నల్లకుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కులగణనను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన సర్వేను పూర్తిస్థాయి నిర్వహించి, క్షేత్రస్థాయిలో వివరాలను పొందుపరచాలని అధికారులకు సూచించారు. కులగణనపై అవగాహన కల్పించడానికి బీసీ కమిషన్ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా మూడో రోజు మంగళవారం గోల్నాక డివిజన్‌లోని నెహ్రూనగర్‌లో నిరంజన్, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు కులగణన జరిగిన తీరుపై ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా నిరంజన్ మాట్లాడుతూ కులగణన సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 28వ తేదీ వరకు సర్వే కొనసాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ బీజేపీ కుటిల రాజకీయం చేస్తోందని, కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజీవ్‌గాంధీ, రాహుల్ గాంధీలపై బీజేపీ నాయకులు విమర్శలు చేయడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, నాయకులు హఫీసర్ నవాబ్, పోలే రామ్మోహన్‌రావు, లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు రామారావు, రావుల సుధాకర్, జమీర్, ఆర్.నరేష్‌యాదవ్, తొలుపునూరి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- నల్లకుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బీసీ కమిషన్ చేపట్టిన కులగణనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం మంగళవారం బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని శంకరయ్యకాలనీలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఇంటింటికి వెళ్లి కులగణనపై ప్రజలను అడిగి వివరాలను తెలుసుకుని మాట్లాడారు. ప్రభుత్వం రీ సర్వే చేస్తున్న నేపథ్యంలో ప్రజలు తమ కుటుంబ సభ్యుల వివరాలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మాజీ కన్వీనర్ గంటి చంద్రుడు రామారావు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దమ్మి కనకయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలి: ఎమ్మెల్యే

ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. ముషీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కార్మికులు, పేద ప్రజలకు ముషీరాబాద్‌లో దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు, వ్యాపారులు, రాజకీయవేత్తలు సామాజిక బాధ్యతతో పేదల అవసరాలను తీర్చేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్, భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకులు టెంట్‌హౌస్ శ్రీనివాస్, శ్రీకాంత్ ముదిరాజ్, శంకర్ గౌడ్, పూసగోరక్‌నాథ్, బిక్షపతి యాదవ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు



ముషీరాబాద్‌లో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ సర్కిల్-15 ఆధ్వర్యంలో ముషీరాబాద్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముషీరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రానికి ప్రజలు హాజరై దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి కుమార్ ముదిరాజ్ మాట్లాడుతూ... వివిధ ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

'జానపద కళాకారులను ఆదుకోవాలి'

రాంనగర్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): జానపద కళాకారులకు వృత్తిపోయి, ఉపాధి కోల్పోయి, దయనీయ స్థితిలో ఉన్న జానపద వృత్తి కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, శివరాత్రి జాగారం సందర్భంగా జానపద కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలని జానపద వృత్తి పరిరక్షణ జాక్ అధ్యక్షుడు మురళీధర్ దేశ్‌పాండే కోరారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శివరాత్రి జాగారం జానపద కళల ప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జానపద అకాడమిని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తెలంగాణలో యక్షగాన జానపద కళాకారులపై సమగ్ర సర్వే చేయాలన్నారు. రవీంద్రభారతిలో జానపద కళాకారుల ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు రూ.500 కోట్లు కేటాయించాలన్నారు. ఈ విషయంపై సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు చైర్మన్ వి.రామకృష్ణరెడ్డి, జానపద మీడియా ఇన్‌చార్జి సీహెచ్.సుధాకర్ బ్రహ్మణి, భవాని తదితరులు పాల్గొన్నారు.



కాచిగూడలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి

వేగంగా మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతులు : కార్పొరేటర్

బర్కత్‌పుర, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో యుద్ధప్రాతిపదికన మంచినీటి పైప్‌లైన్ల మరమ్మతులు చేపడుతున్నామని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి పేర్కొన్నారు. మంగళవారం డివిజన్‌లోని చప్పల్‌బజార్, ఇందిరానగర్, బండలబస్తీ పలు ప్రాంతాలలో ఆమె పాదయాత్ర చేసి స్థానిక ప్రజలెదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. మంచినీటి పైప్‌లైన్ వాల్వ్‌లు కుంగిపోవడంతో నీటి సరఫరాలో అంతరాయం జరుగుతుందని, మరమ్మతులు చేయాలని కోరారు. దీంతో జలమండలి అధికారులతో మాట్లాడినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు భీమ్‌రాజ్, రవియాదవ్, ఆర్. సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి

- ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నిమ్‌కర్



విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు హెల్మెంట్‌లను పంపిణీ చేసిన ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నిమ్‌కర్, సయ్యద్ అహ్మద్ భక్తియార్

ముషీరాబాద్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నిమ్‌కర్ పేర్కొన్నారు. మంగళవారం ముషీరాబాద్‌లో ట్రాక్స్ సొసైటీ రోడ్ సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ, ఐసీఐసీఐ లాంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ సంయుక్త ఆధ్వర్యంలో రేడియెంట్ హైస్కూల్ విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు 'రైడ్ టు సేఫ్టీ' పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా 120 హెల్మెంట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ట్రాక్స్ సొసైటీ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేష్ నిమ్‌కర్ మాట్లాడుతూ... రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహనదారులు హెల్మెంట్‌లు తప్పనిసరి ధరించాన్నారు. దేశవ్యాప్తంగా గంటకు 50 మంది ద్విచక్ర వాహనదారులు రోడ్డు ప్రమాదాలలో మృతిచెందుతున్నారని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల నుంచి రోడ్డు ప్రమాదాల సంఖ్య కొంత తగ్గిందని సూచించారు. విద్యార్థులు రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రేడియెంట్ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ అహ్మద్ భక్తియార్ తదితరులు పాల్గొన్నారు.

కథలు నిజజీవితానికి ప్రతిబింబాలు

సీనియర్ పాత్రికేయుడు బైస దేవదాసు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బైస దేవదాసు, పార్వతీశం, రామరాజు తదితరులు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): కథలు నిజజీవితం ప్రతిబింబాలేనని సీనియర్ పాత్రికేయుడు బైస దేవదాసు అన్నారు. వంశీ ఆర్ట్ థియేటర్స్, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగాన సభలో కస్తూరి అలివేణి రచించిన ప్రతిబింబాలు కథాసంపుటి ఆవిష్కరణ, వంశీరామరాజు, డా.సుధారామరాజుకు అంకిత మహోత్సవసభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన దేవదాసు సంపుటిని ఆవిష్కరించారు. వాస్తవికత ఉన్న కథలు కాలపరీక్షకు నిలబడతాయని తెలిపారు. అలివేణి చెప్పిన కథలు సమాజంలో జరిగే సంఘటనలకు అద్దం పడుతాయని వివరించారు. అంకితం తీసుకున్న వంశీ దంపతులు సాంస్కృతిక రంగానికి రెండు కళ్లు అని అభివర్ణించారు. సాహితీవేత్త ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ సులభమైన పదాలతో ఎలాంటి అతిశయోక్తులు లేకుండా చెప్పే నేర్పు అలివేలు సొంతం అన్నారు. ఇంటిపేరు కస్తూరిలోనే సుగంధం నింపుకున్న ఆమె కథలు సువాసన భరితం అన్నారు. రచయిత్రి శైలజామిత్ర సంపుటిలోని కథలను గురించి వివరించారు. లేఖిని సంస్థ అధ్యక్షురాలు అత్తలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సంస్థల కార్యక్రమాలు పరిచయం చేశారు. తొలుత ప్రముఖ గాయకుడు వైఎస్.రామకృష్ణ బృందం దర్శకుడు విశ్వనాథ్ సినిమాలలోని పాటలను మధురంగా గానం చేశారు.

హైకోర్టు న్యాయవాది మృతికి సంతాపం

నల్లకుంట, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు సీనియర్ న్యాయవాది వేణుగోపాల్‌రావు కోర్టులో కేసు వాదిస్తూ గుండెపోటుతో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందడం బాధాకరమని హైకోర్టు న్యాయవాది, టీపీసీసీ లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు గంటన్నగారి రామారావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పట్ల సంతాప సూచకంగా కోర్టులోని అన్ని బెంచీలలో వాదనలన్నింటినీ వాయిదా వేస్తూ న్యాయమూర్తులు తీసుకున్న నిర్ణయం సరైనదన్నారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

కేవైసీ అప్‌డేట్ పేరుతో రూ.1.78 లక్షలు కాజేత

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు అధికారుల మంటూ ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు వెంటనే కేవైసీ అప్‌డేట్ చేయాలంటూ చెప్పి లింకు పంపి మహిళ ఖాతా నుంచి రూ.1.78 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగినికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. తాము ఆర్‌బీఎల్ బ్యాంకు అధికారులమంటూ పరిచయం చేసుకున్నారు. వెంటనే బ్యాంకు ఖాతాలకు సంబంధించి కేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని లేని పక్షంలో ఖాతాలు ఫ్రీజ్ చేస్తామని బెదిరించారు. తాము పంపిన లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్‌బీఎల్ క్రెడిట్ కార్డు వివరాలు నమోదు చేస్తే, నిమిషాల్లో కేవైసీ పూర్తవుతుందని చెప్పారు. లింక్‌ను పంపిన సైబర్ నేరగాళ్లు ఫోన్ ద్వారా ఆమెకు సూచనలు అందిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మిన బాధితురాలు, వారు పంపిన లింక్‌ను తెరిచి, ఆర్‌బీఎల్ బ్యాంకు వెబ్‌సైట్‌ను పోలిన నకిలీ వెబ్‌సైట్‌లో తన బ్యాంకు ఖాతాల వివరాలు నమోదు చేసింది. ఫోన్‌కాల్‌లో ఉండగానే తన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వేరే ఖాతాకు వెళ్లినట్లుగా సందేశాలు వచ్చాయి. దాంతో ఆమె బ్యాంకు అధికారులను సంప్రదించి, ఖాతాను ఫ్రీజ్ చేయించింది. ఈ సమయంలో బాధితురాలికి చెందిన యాక్సిస్ బ్యాంకు ఖాతా నుంచి డబ్బులు వేరే ఖాతాలకు మళ్లించినట్లు సందేశాలు వచ్చాయి. ఇలా పలు దఫాలుగా ఆమె బ్యాంకు ఖాతాల నుంచి సైబర్‌నేరగాళ్లు రూ.1,78,363 కాజేశారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కొత్త నెంబర్ల నుంచి వచ్చే ఏపీకే లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ తెరవొద్దని సైబర్ క్రైం అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.